# నీడ – నిజం

"వస్తాడంటావా?" అన్నాడు భగీరథ సిగరెట్ వెలిగిస్తూ

"వచ్చేస్తాడు...." అన్నాడు సూర్యనారాయణ కిటికీ లోంచి పడుతున్న వర్షాన్ని చూస్తూ.

"అనవసరంగా మనం కారుని పంపించేసాం. ఈ వర్షంలో తిరిగి వెళ్ళాలంటే కష్టమే!" అన్నాడు గాంధీ కేండిల్ వెలిగిస్తూ.

వాతావరణం చలిచలిగా ఉంది. ఆ ఫారమ్ హౌస్ ఊరికి దూరంగా విసిరేసినట్టుగా ఉంది. ఆ ముగ్గురూ తమ వద్దకు రావలసిన వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నారు. క్షణాలు గడుస్తున్నా, అవి నిముషాలుగా మారి గంట కావస్తున్నా తాము ఎదురు చూస్తున్న వ్యక్తి రావడం లేదు.

అరగంట తర్వాత, 'ఈ వెంకట్రావ్ మహాశయుడు ఈ వర్షంలో ఎక్కడ చిక్కుకుపోయాడో! అన్నాడు భగీరథ విసుగ్గా.

"బాబూ భగీరథా! నువ్ సిటీకి దూరంగా ఈ గెస్ట్‌హౌస్ కట్టించనేల కట్టించావ్ అనుకో కేసుల్ని వదులుకుని, కాస్త గొంతు తడుపుకుందామని వచ్చిన మనం ఇలా ఈ తుఫానులో ఇరుక్కుపోవడమేమిటి?" అన్నాడు సూర్య నారాయణ తన అసహనాన్ని ప్రకటిస్తూ.

"బాబూ, ఈ రోజు పార్టీ ఇచ్చేది వెంకట్రావే. మెడికల్ కంపెనీ వారి సౌజన్యంతో పారిస్ వెళ్ళొచ్చాడు. అక్కడ నించి తెచ్చిన షాంపెయినుతో మనకు పార్టీ ఇవ్వబోతున్నాడు. మీరు బయలుదేరండి, ఒక కేసు చూసుకుని వచ్చేస్తాను అన్నాడు, ఇంతవరకు అతడి అడ్రస్ లేదు" అన్నాడు భగీరథ.

"వరుసగా నైట్ డ్యూటీలే! నాకు నిద్దరొస్తుంది" అంటూ ఆ గదిలోని సోఫా మీద నడుం వాల్చాడు సూర్యనారాయణ.

“నేనూ నిద్రకు ఆగలేను” అంటూ తను కూర్చున్న పడక కుర్చీలోనే పడుకుని కళ్ళు మూసుకున్నాడు గాంధీ.

ఇద్దరూ పడుకున్న పావుగంట వరకూ భగీరథలో ఏవేవో ఆలోచనలు. అలా ఆలోచిస్తూనే తనూ నిద్రకు ఉపక్రమించాడు భగీరథ.

* * *

తలుపు మీద టక్‌టకమని బాదిన చప్పుడు.

“వచ్చేసినట్టున్నాడు” అన్నాడు సూర్య నారాయణ ఆనందంగా.

గాంధీ తలుపు తీసాడు. ఎదురుగా ఒక ఆగంతకుడు.

ఆ ఆగంతకుడి వంటి మీద నించి వచ్చిన ఫారిన్ సెంటు పరిమళం ఒక్క సారిగా ఆ గదిలో వ్యాపించింది. నల్లరెయిన్‌కోటు, నెత్తి మీద టోపీ, జీన్‌ఫాంటు, టీషర్టు. చేతిలో లెదర్ బేగ్. వయసు నలభై లోపే.

“సారి, వైజాగ్ వెళుతూంటే కారు ట్రబు లిచ్చింది. మీ దగ్గర టూల్ కిట్ ఉందా!” అన్నాడు ఆ వ్యక్తి ముగ్గురినీ పరిశీలనగా చూస్తూ.

“లేదండీ లేదు.” అన్నాడు భగీరథ “సరే డ్రైవర్‌ని పంపేసి వస్తాను. ఈ బేగ్ ఇక్కడుంచి వెళతాను” అంటూ గబగబా బైటకు వెళ్ళిపోయాడు.

అతడు వదిలివెళ్ళిన లెదరు బ్యాగు తెరిచే ఉంది. ఆ బేగులోని వస్తువులు ఆ ముగ్గుర్నీ ఆకర్షించాయి.

వాతావరణం చల్లగా ఉంది. వర్షపు చినుకులు లయబద్ధంగా పడుతున్నాయి. ఆ ముగ్గురికీ ఒక్కసారి నాలుక తడారినట్టయింది. ఆ బేగ్ చూసేసరికి.

“ఛీ మనకు బుద్ధిలేదు. పార్టీ చేసుకుందామని వచ్చినవాళ్ళం, అసలు సరంజామా లేకుండా వచ్చి ఈ వర్షంలో ఇరుక్కుపోయాం” అన్నాడు గాంధీ చిరాగ్గా ముఖం పెట్టి.

భగీరథ అతడి ముఖంలోకి చూసి ఏదో చెప్పబోయాడు. ఇంతలో బూట్ల చప్పుడు వినిపించడంతో మాటలు ఆపు చేశాడు. ఆ ఆగంతకుడు లోపల కొచ్చాడు.

"మెకానిక్‌ను తీసుకురమ్మని డ్రయివర్‌ని పంపాను. అతడొచ్చేవరకూ మీకు అభ్యంతరం లేకపోతే ఇక్కడ కాసేపు వుండొచ్చా..!" అన్నాడు.

"ఉండండి. బైట వర్షం వస్తోంది కదా! ముందు ఆ రెయిన్ కోటు తీసి ఈ టవల్‌తో తుడుచుకోండి" అంటూ టవల్ అందించాడు గాంధీ.

అతను రెయిన్ కోటు విప్పి తల తుడుచుకుంటూ తెరిచిన ఆ బేగు లోంచి సిగరెట్ పాకెట్ బైటకు తీసాడు. మామూలు సైజు కన్నా పొడుగ్గా వున్న సిగరెట్లు. అందరికీ ఒక్కో సిగరెట్ ఇచ్చాడు. వాళ్లు నలుగురు సిగరెట్స్ వెలిగించారు.

భగీరథ కిటికీలోంచి చూస్తూ "ఇక రాడేమో!" అన్నాడు.

"మీరు ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్టున్నారు" అన్నాడు ఆ వ్యక్తి.

"ఔను పార్టీ చేసుకుందామని వచ్చాం, అయితే పార్టీ ఇచ్చే వ్యక్తి రాలేదు" అన్నాడు భగీరథ.

"ఇంకేం నా దగ్గర మంచి సరుకుంది. సరదాగా సెలబ్రేట్ చేసు కుందాం" అంటూ ఆ వ్యక్తి ఆ లెదర్ బేగ్‌లోంచి సీసాలు బయటకు తీసాడు.

ఆ ముగ్గురి కళ్ళు ఒక్కసారిగా మెరిసాయి. అవి ఇండియాలో దొరకవని వాళ్ళకు అర్థమయింది.

గాంధీ, సీసా మీది లేబుల్ చూసి "అమ్మో ఇండియా కరెన్సీలో దీని ఖరీదు పది వేలు. మీరు ఎవరి కోసమో వీటిని తీసుకెళుతున్నారను కుంటు న్నాము, మా కోసం వీటిని ఖర్చు చేయకండి" అన్నాడు మొహమాటపడుతూ.

“ఫరవాలేదు. అర్ధరాత్రి వచ్చిన ఈ అపరిచితుడికి ఆశ్రయం ఇచ్చారు. అందుకు కృతజ్ఞతగా ఈ పార్టీ” అంటూ ఆ సీసా సీలు విప్పాడు.

సూర్యనారాయణ జీడిపప్పు, పకోడీలు ప్లేట్లలో సర్దాడు.

ఆ ఆగంతకుడు నాలుగు గ్లాసుల్లోకి ఆ సీసాలోని ద్రవాన్ని పంపాడు. భగీరథ తను తెచ్చిన సీసాలోని నీటితో గ్లాసులు నింపాడు.

ఆ నలుగురి గ్లాసులు ‘ఛీర్స్’ అంటూ పైకి లేచాయి.

“అన్నట్టు మీ పేరు!” అన్నాడు గాంధీ.

“పేరుదేముంది లెండి, అర్ధరాత్రి ఒంటరి బాటసారి అనుకోండి” అన్నాడు.

ఆ ముగ్గురూ షాక్ తిన్నట్టు చూసారు.

“కంగారుపడకండి, నా పేరు గౌతమ్- పూర్తి పేరు సిద్ధార్థ గౌతమ్, న్యూజెర్సీలోని ఒక రీసెర్చి ఇనిస్టిట్యూట్‌లోని కేన్సర్ విభాగంలో పని చేస్తున్నాను” అన్నాడు.

“మైగాడ్, మా ముగ్గురిలాగే మీరూ డాక్టరన్నమాట?” అన్నాడు భగీరథ ఆనందంగా.

అతడు నవ్వుతూ, “మీ వివరాలు చెప్పండి” అన్నాడు.

భగీరథ గ్లాసులోని ద్రవాన్ని చప్పరిస్తూ, నా పేరు డాక్టర్ భగీరథ, సర్జన్‌ని. నా పక్కన కూర్చున్న ఈయన గాంధీ, ఎనస్థటిస్ట్. ఆ కిటికీ దగ్గరకెళ్ళి సిగరెట్ కాలుస్తున్న వ్యక్తి సూర్యనారాయణ, ఫిజీషియన్, మేం ఎదురు చూస్తున్న వ్యక్తి డాక్టర్ వెంకట్రావ్. మాలాగానే గవర్నమెంట్ ఆసుపత్రిలోనే పనిచేస్తున్నాడు. మేం నలుగురం నా గెస్ట్ హౌస్‌లో నెలకోసారి పార్టీ చేసు కుంటాము. ఈ రోజు పార్టీ ఈవెంట్ మేనేజర్ డాక్టర్ వెంకట్రావ్ మిస్సింగ్.... ఆ ఖాళీని మీరు భర్తీ చేశారు” అన్నాడు భగీరథ.

“బావుంది మీతో పరిచయం. చాలా సంతోషం కలిగిస్తోంది” అన్నాడు.

గ్లాసులు ఖాళీ అయ్యాయి. గౌతమ్ సీసాలోని ద్రవాన్ని మళ్ళీ గ్లాసుల్లోకి నింపాడు.

ఆ ముగ్గురి వంకా చూస్తూ, “అంతా మౌనంగా వున్నారు. ఏదైనా మాట్లాడండి?!” అన్నాడు గౌతమ్.

“మీరే చెప్పండి. ఫారిన్‌లో మన డాక్టర్ల కబుర్లు” అన్నాడు గాంధీ.

“ఈ మధ్యకాలంలో బాగా ప్రాముఖ్యంలోకి వచ్చిన విషయం మెర్సీ కిల్లింగ్. దాన్ని చట్టపరిధిలోకి తీసుకురావడం కోసం ఉద్యమాలు మొదలయ్యాయి” అన్నాడు గౌతమ్.

“ఔను ఈ మధ్య స్వచ్ఛందంగా మరణాన్ని ఆహ్వానించే కేసులు వస్తున్నాయి. అయితే అలా ఇచ్ఛా మరణాన్ని కోరుకోవడానికి ఎంతో నైతిక బలం కావాలి” అన్నాడు భగీరథ గ్లాసులోని ద్రవాన్ని చప్పరిస్తూ.

“ఔను, ఈ మధ్య పేపర్లో ఒక వార్త చదివాను. కేరళలో ఒకాయన స్వచ్ఛంద మృత్యు వైద్యాలయాలు ఏర్పాటు చేయాలంటాడు. అది ఆత్మ హత్య క్రిందకు రాదట, ఇండియన్ పీనల్ కోడ్ 306, 309 సెక్షన్ల కింద మరణం కిందే లెక్కట” అన్నాడు గాంధీ తాను తాగేసిన గ్లాసు కింద పెట్టి.

గౌతమ్ క్షణం సేపు మౌనంగా వున్నాడు. ఆ ముగ్గురి వంకా పరిశీలనగా చూస్తూ, “కొంతమంది తమ తమ జీవితంలో విసిగి వేసారో, ఆరోగ్య పరిస్థితులు బాగోలేకనో స్వచ్ఛంద మరణం కోరుకుంటారు. ప్రాణాలు పోసే డాక్టర్లయిన మనం ఏ పేషంటయినా చనిపోవాలని కోరుకుంటామా?” అన్నాడు.

“అంటే?” ఎదురు ప్రశ్న వేసాడు గాంధీ.

“మీలో ఎవరైనా, ఎపుడైనా మీ పేషంటు చనిపోతే బావుటుంది...” అని కోరుకున్నారా?” అన్నాడు గౌతమ్.

అతని ప్రశ్నలోని భావం అర్థమయిన ఆ ముగ్గురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఆ ప్రశ్న ఆ నిశ్శబ్ద వాతావరణంలో వారికి ఆశ్చర్యంతో పాటూ భయాన్నీ కలిగించింది.

ఉరుములు మెరుపులతో ఆ చీకటి రాత్రి. ఊరికి దూరంగా ఉన్న ఆ గెస్టు హౌస్‌లో కరెంటు లేకపోవడం ఇవేమీ ఆ ముగ్గుర్నీ కదిలించలేదు. తమ మధ్యలోకి అర్ధరాత్రి వచ్చి వేసిన ఆ ఆగంతకుడి ప్రశ్న వారిని ఆలోచింప చేసింది.

"ప్రశ్న వేసింది మీరే కాబట్టి మీరే ముందుగా మీ అనుభవం చెపితే బావుంటుంది" అన్నాడు. గాంధీ, గౌతమ్, వంక చూస్తూ"

లేదు మీ అనుభవమే ముందు చెప్పండి అన్నాడు గౌతమ్.

ఆ మాటలకు గాంధీ క్షణం సేపు ఆలోచించి, "నేను రెండు సంవత్సరాల క్రితం ఒక ప్రాథమిక వైద్యకేంద్రంలో పనిచేసాను. ఒక కేసొచ్చింది. లారీ ప్రమాదంలో కాలు, చెయ్యి పోయాయి. వెన్నుపూస దెబ్బతింది. ఆ రోగి బతుకుతాడు. కానీ జీవితాంతం మంచం మీదే జీవచ్ఛవంలా బతుకుతాడు. ఆ పరిస్థితుల్లో బతకడం కన్నా ఆ వ్యక్తి చనిపోవడమే మేలని కోరుకున్నాను" అన్నాడు తన గ్లాసులోని ద్రవాన్ని త్రాగడం ఆపి.

అందుకు గౌతమ్ వెంటనే, "ఔను మీరు చెప్పింది నిజమే, మానవత్వంతో ఆలోచిస్తే ఆ రోగి చనిపోవాలని కోరుకోవడంలో తప్పులేదు. అయితే ఇంతకీ ఆ రోగి చనిపోయాడా!" అన్నాడు గౌతమ్ ఆసక్తిగా.

"నా ట్రీట్‌మెంటుకు పూర్తిగా కోలుకున్నాడు. డిస్చార్జయి ఇంటికి వెళ్ళిన నెల తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు" అన్నాడు గాంధీ బాధగా.

"మైగాడ్ చాలా విషాదకరమైన సంఘటన" అన్నాడు గౌతమ్.

ఆ గదిలో మళ్ళీ నిశ్శబ్దం. గాంధీ చెప్పిన సంఘటన వాళ్ళను కదలించింది. అంతా మౌనంగా ఉండిపోయారు.

సూర్యనారాయణ వైపు చూసాడు గౌతమ్.

"నాకూ అలాంటి అనుభవమే ఎదురయ్యింది", అంటూ సూర్య నారాయణ చెప్పడం మొదలు పెట్టాడు.

"ఒకసారి బాంబు దాడిలో బాగా గాయపడిన ఒక ఫాక్షన్ లీడర్‌కు ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చింది. థియేటర్‌లో ఆపరేషన్‌కు ఏర్పాట్లు జరిగాయి. నలుగురున్న టీమ్‌లో నేను ఫిజిషియన్‌ను. నా సలహాతో ఆపరేషన్ మొదలయింది. ఆ వ్యక్తి మూలంగా అప్పటికే యాభైకి పైగా వ్యక్తులు చనిపోయారు. వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. బతికి బయటకొస్తే ఆయన మూలంగా మరి కొంతమంది ఆడపడుచుల పుస్తెలు తెగిపోతాయి. డాక్టరుగా ఆ ఫాక్షను లీడరు బతకడం కోసం రాత్రంతా నిద్ర లేకుండా పనిచేసాను. అయితే నాలోని మానవుడు మాత్రం ఆ వ్యక్తి చనిపోతే బాగుండును అని కోరుకున్నాడు ఆ రాత్రి."

సూర్యనారాయణ చెప్పడం ఆపి సిగరెట్ వెలిగించాడు.

"ఇంతకీ ఆయన చనిపోయాడా!" గౌతమ్ సూర్యనారాయణ ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"లేదు, ఆపరేషన్ విజయవంతం అయింది. పోస్టు ఆపరేటివ్ కేర్‌లో వారం రోజులుంచి పూర్తి ఆరోగ్యవంతుడిగా బయటకు పంపాము. అయితే..!" చెప్పడం ఆపి సూర్యనారాయణ అందరి వంకా తిరిగాడు. సీసాలోని ద్రవాన్ని గ్లాసులో వంచుకుని తాగి, ఒక్కసారి ఊపిరి పీల్చి వదిలి, "ఆసుపత్రి నించి ఇంటికి వెళుతున్న అతడిని బాంబులతో చంపేసారు ప్రత్యర్థులు" అన్నాడు.

ఆ గదిలో మళ్ళీ మంచుగడ్డ కట్టినట్లుగా నిశ్శబ్దం. సూర్యనారాయణ చెప్పిన ముగింపుతో అందరూ ఉలిక్కిపడ్డారు.

భగీరథ గబగబా లేచి కిటికీ దగ్గర కెళ్ళాడు. గౌతమ్ అతడినే గమ నిస్తున్నాడు.

“డాక్టర్, మీ అనుభవమే మిగిలిపోయింది” అన్నాడు గౌతమ్, భగీరథను ఉద్దేశించి.

“అబ్బే నాకు అలాంటి అనుభవాలు లేవు” అన్నాడు భగీరథ తలొంచుకునే.

“అయితే నా అనుభవం చెపుతాను వినండి” అంటూ భగీరథ వైపే చూసి చెప్పడం ప్రారంభించాడు గౌతమ్.

“సరిగ్గా వారం రోజుల క్రితం ఇలాంటి రాత్రే. వర్షం, గాలితో తుఫాను లాంటి బీభత్సం. హైవే రోడ్డు మీద స్కూటర్ మీద వెళుతున్న ఒక వ్యక్తిని ఒక టాటా సుమో గుద్దుకుంటూ వెళ్లిపోయింది. రెప్పపాటులో హైవే మీద రక్తపు మడుగులో ఆ వ్యక్తి కొట్టుమిట్టాడుతున్నాడు. ఆయనను గుద్దిన వాహనం ఆగలేదు” చెప్పడం ఆపి మళ్ళీ భగీరథ కళ్ళల్లోకి చూసాడు గౌతమ్.

భగీరథ తలవంచుకున్నాడు.

“అలా చావుకు చేరువలో ఉన్న ఆ వ్యక్తిని ఆ హైవే చీకటి రోడ్డు మీద వెళుతున్న ఏ వాహనమూ పట్టించుకోలేదు. ఆఖరికి పోలీస్ పెట్రోలింగ్ వారు గుర్తించి అతడిని ఆసుపత్రిలో చేర్చారు”

గౌతమ్ క్షణం సేపు చెప్పడం ఆపి భగీరథ కళ్ళల్లోకి మళ్ళీ చూసి, “ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్‌లో ఆపరేషన్ చెయ్యాల్సిన డాక్టర్ ఆ సమయానికి అందుబాటులో లేడు. ఒక పిజి విద్యార్థి ఆ పేషంటుకు వైద్యం చేసాడు. ఆ ప్రభుత్వాసుపత్రిలో సమయానికి ఇవ్వవలసిన ట్రీట్‌మెంట్ ఆ డాక్టరు ఇస్తే పేషంటు బ్రతికేవాడేమో! అయితే....!”

“ఇంతకీ రోడ్డు మీద ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చనిపోయిన ఆ వ్యక్తి ఎవరు?” గాంధీ, గౌతమ్ చెపుతున్న మాటలకు అడ్డొస్తూ అన్నాడు.

"ఆ విషయం తర్వాత చెపుతాను. ముందు నేను చెప్పేది వినండి. ఆ హైవే రోడ్డు మీద ప్రమాదం జరిపిన వ్యక్తి, ఆసుపత్రిలో ప్రమాదబాధితుడికి చికిత్స జరపని వ్యక్తి ఇద్దరూ ఒకరే!"

గౌతమ్ చెప్పిన మాటలకు భగీరథ తలొంచుకున్నాడు. మిగతా ఇద్దరూ మౌనంగా వింటున్నారు.

గౌతమ్ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"రోడ్డు మీద ప్రమాదం జరిపినప్పుడు ఆ క్షతగాత్రుడిని ఆసుపత్రికి తీసుకువెళ్ళడం కనీస ధర్మం. అలాగే డ్యూటీలో ఉండి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అందుబాటులో ఉండి వైద్యం చేయడం వారి వృత్తిధర్మం."

"ఈ రెండు ధర్మాలను అతిక్రమించడం తోపాటు ఆ డాక్టర్ ఇంకో తప్పు చేశాడు" గౌతమ్ చెప్పడం ఆపి లేచి నుంచున్నాడు.

భగీరథ కుర్చీలో కూర్చుని రెండు చేతుల్లోనూ ముఖం కప్పుకున్నాడు.

గౌతమ్ భగీరథ వంక చూడకుండా, "కారుతో ప్రమాదం చేసి తనకు బదులుగా తన కారు డ్రైవర్‌ని రికార్డుల్లోకి ఎక్కించాడు శిక్ష పడుతుందని. అయినా నిజం చచ్చిపోదు. అది జీవితాంతం వెంటాడుతుంది. మనం ఇంతవరకూ మెర్సీ కిల్లింగ్ గురించి మాట్లాడుకున్నాం. పూర్తి అంగవైకల్యంతో జీవచ్ఛవంలా బతకడం కంటే చావడం మంచిదని ఒక డాక్టరుగారు ఇందాక తన అనుభవంగా చెప్పారు. అయితే నేనూ అదే కోరుకుంటున్నాను. నేనుత చెప్పిన రెండు తప్పులు చేసిన డాక్టరుకూ అంగవైకల్యం వుంది. అది కనిపించనిది. ఆయనలోని వైకల్యం చావాలని కోరుకొంటున్నాను."

చెప్పడం పూర్తి చేసి గబగబా గౌతమ్ ఆ రూము దాటి బైటకొస్తూ, "ఇంతకూ చనిపోయిన వ్యక్తి ఎవరో తెలుసా?" అన్నాడు ఆ ముగ్గురి వైపు చూస్తూ.

అందరూ అతడి వంక ప్రశ్నార్థకంగా చూసారు.

“రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి ఓడిపోయిన క్షతగాత్రుడిని నేనే! ఔను నేను చనిపోయాను...” అంటూ ఆ వ్యక్తి గట్టిగా నవ్వుతూ అక్కడ నించి అదృశ్యమయ్యాడు.

ఆ సమాధానం ఆ గదిలో బాంబులా పేలింది. చేతుల్లో వున్న ఆ ముగ్గురి గ్లాసులు క్రింద పడి భళ్ళున పగిలాయి. జరిగిన సంఘటన కలిగించిన షాక్‌తో ముగ్గురికీ స్పృహ తప్పింది.

* * *

తలుపు మీద టకటక మని చప్పుడు. భగీరథ కళ్లు తెరవలేక పోతున్నాడు. అతికష్టం మీద తెరిచాడు. చుట్టూ చూసాడు. సూర్యనారాయణ సోఫాలోనూ, గాంధీ పడక కుర్చీలోనూ నిద్రపోతూ కనిపించారు. అంతకు ముందు ఆ గదిలో గ్లాసులు పగిలిన గుర్తులు లేవు. తాము రాత్రి తాగిన ఆనవాళ్ళు కనిపించలేదు. అతడికి ఆశ్చర్యంగా ఉంది. తలుపుమీద దబదబ మని చప్పుడు. తలుపు తీసాడు ఎదురుగా డాక్టర్ వెంకట్రావ్. రాత్రంతా తాము ఎదురుచూసిన వ్యక్తి.

“ఏంటీ తెల్లారినా నిద్రపోతూనే వున్నారు” అన్నాడు వెంకట్రావ్.

“నిద్రపోవటం కాదు. డాక్టర్ గౌతమ్ అనే ఒక ఎన్నారై డాక్టరు మాకు పార్టీ ఇచ్చాడు....” అన్నాడు భగీరథ మెల్లగా.

“నీకేమైనా మతిపోయిందా? వారం క్రితం ఏక్సిడెంట్ జరిగి మన ఆసుపత్రిలోనే అతడు అపస్మారక స్థితిలో చేరాడు. నిన్న సాయంత్రం చనిపోయాడు. సమయానికి సర్జన్ వైన నువ్వు అందుబాటులో లేవు. చిన్న గొడవ జరిగింది. పీజీలతో మేనేజ్ చేసేసాం. ఈ వ్యవహారం వల్ల లేటయ్యింది. మీకు వాహనం లేదని నేను రావలసి వచ్చింది. చనిపోయిన వ్యక్తి వచ్చి

మీకు పార్టీ ఇచ్చాడా? జోకులాపు!'' అన్నాడు వెంకట్రావ్ సీరియస్‌గా ముఖం పెట్టి.

వెంకట్రావ్ మాటలకు భగీరథ శరీరంలోని రక్తం అంతా తోడేసినట్టయింది. శరీరంలో ఒక గగుర్పాటు. కలకు, వాస్తవానికి మధ్య రేఖను గుర్తించలేని భ్రమకు లోనయ్యాడు. ఇంకా అనుమానంగానే ఉంది.

అప్పటికే నిద్రలేచిన గాంధీ, సూర్యనారాయణ ''ఏంటీ హడావుడి!'' అన్నారు సంయుక్తంగా.

''రాత్రి మనకు ఆ ఎన్నారై డాక్టరు పార్టీ ఇచ్చాడుగా, మెర్సీ కిల్లింగ్ గురించి మీ అనుభవాలు చెప్పారు కదా'' అన్నాడు భగీరథ ఇద్దరి వంక చూసి.

గాంధీ, ఆశ్చర్యంగా భగీరథ వంక చూసి, ''కలగన్నావా? మెర్సీ కిల్లింగ్ గురించి మనం నెల రోజుల క్రితం ఇదే గెస్ట్‌హౌస్‌లో పార్టీ చేసుకున్నప్పుడు చెప్పుకున్నాం. ఈ రాత్రి మాత్రం హాయిగా నిద్రపోయాం'' అన్నాడు గాంధీ.

వారి మాటలకు తనలోని అలజడి పైకి కనబడనీయకుండా కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు భగీరథ.

''ఇక బయలుదేరదాం!'' అనుకుంటూ వెంకట్రావ్, సూర్యనారాయణ, గాంధీ ఆ గది దాటి బయటకొచ్చారు.

దూరంగా ఎక్కడనించో ఎవరో పిల్లవాడు ఏడుస్తున్న శబ్దం లీలగా వినిపిస్తోంది. హైవే రోడ్డు మీద తిరుగుతున్న వాహనాల శబ్దం. దానికి శృతిగా టపాటపామని వర్షపు చినుకులు పడుతూ వాహనాల రణగొణ ధ్వనులకు తాళం వేస్తున్నాయి. పూర్తిగా తెల్లవారింది. బాగా పరుచుకున్న పల్చటి వెలుగు తెరలు. మబ్బుల్లో దాగిన సూర్యుడు మెల్లగా బైటకొస్తున్నాడు.

బైటకొచ్చిన ఆ ముగ్గురూ కారెక్కి భగీరథ కోసం ఎదురు చూస్తున్నారు.

ఐదు నిముషాల తర్వాత వచ్చిన భగీరథ వారితో మాట్లాడకుండా కారెక్కి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు.

కారెక్కుతూ ముందు చక్రం పైన ఎర్రగా గడ్డకట్టిన్నట్టు రక్తపు మరకను చూసి ఉలిక్కిపడ్డాడు భగీరథ. దాన్ని వారం రోజులుగా చూస్తూ వున్నా, ఈసారి చూసినపుడు మాత్రం ఒంట్లోని నరాలన్నీ జివ్వుమని లాగినట్లనిపించింది అతడికి.

వణుకుతున్న చేతుల్తోనే కారు స్టార్ట్ చేసాడు భగీరథ.

హైవే రోడ్డు మీద కారు మెల్లగా వెళుతోంది. రోడ్డుకు ఆనుకునే వున్న చెట్లు వర్షానికి తడిసి ఆ ప్రాంతమంతా ఏదో తెలియని పరిమళంతో గుభాళిస్తోంది. వాతావరణం చల్లగా వుంది. గాలివానకు చెదిరిపోయిన పక్షులన్నీ మెల్లమెల్లగా చేరుకుంటూ కిచకిచ శబ్దాలతో సూర్యోదయాన్ని స్వాగతిస్తున్నాయి. కారు స్టీరియో లోంచి మంద్రస్థాయిలో వస్తున్న సంగీతం, ఆ వాతావరణంలో మరింత ఆహ్లాదం కలిగిస్తోంది. ఇవేమీ భగీరథలోని అలజడిని తగ్గించలేక పోతున్నాయి.

కారు ముందుకు వెళుతోంది. గెస్ట్‌హౌస్‌లో రాత్రి కలలో కనిపించిన నీడ, అది వినిపించిన ఆ భయంకరమైన నిజం మాత్రం భగీరథను వెన్నంటే వస్తోంది.

(రచన డిసెంబరు 2008)